


## ఆలోచింపజేసే కథ

# చిన్ని నా తండ్రికి శ్రీరామరక్ష

**శ్రీమతి కళ్యాణీ సోమరాజ్**

సుమతి డైనింగ్ హాల్లో వున్న పెద్ద గ్లాస్ డోర్స్ నుంచి బయటకు చూస్తోంది. ఎక్కడ చూసినా రాశులు పోసినట్లు తెల్లని మంచే చుట్టూతా! నాలుగు నెలల క్రితం తను 'డెట్రాయిట్' వచ్చినప్పుడు వెచ్చగా స్వాగతం చెప్పిన ఆ ప్రకృతి ఇప్పుడు మంచుదుప్పటి కప్పుకుంటోంది మెల్లగా!

వచ్చిన కొత్తల్లో కూతురి కుటుంబంతో కలిసి అందరూ ఫాల్స్ చూడటానికి 'పెటోస్కీ' వెళ్ళారు. తనెప్పుడూ మరిచిపోలేదు ఆ ప్రయాణాన్ని.

దారంతా పసుపు, నారింజపండు రంగులతో బారులు తీరివున్న వృక్షాలను అలసట వచ్చేలా అదే పనిగా చూసింది. అప్పుడే వ్యాపిస్తున్న పల్చని సూర్య కాంతి మధ్య రంగుల వన్నెలు మరింతగా మెరిసాయి.

ఎంత చక్కటి వర్ణాల మేళవింపు!

భగవంతుడు సుతారంగా సృష్టించుకున్న మనోహరమైన చిత్రపటంలా వుంది ఏ చోట దిగి చూసినా! ఆ రోజంతా ఒక సుందర స్వప్నంలో తిరుగుతున్నట్లే ఉంది ఇంటికి చేరినా.

అయితే ఆ అనుభూతి...ఆనందం ఎక్కువ రోజులు నిలవకుండానే ఆకులన్నీ రంగులు మారి నేలరాలాయి. కాలి బాటలన్నీ ఆకులతోనే కప్పబడ్డాయి. ఇప్పుడు ఆ మోడుబారిన చెట్లమీద పడ్డ మంచుముద్దలు అప్పుడే పూచిన నందివర్ధనాల్లా వున్నాయి దూరానికి.

ఋతువులెంత తెలియకుండా జారిపోయాయి! తాను గమనించలేదు. అంతగా మునిగిపోయిందా మనుమడి సాహచర్యంలో!

భరత్!

వాడీ ప్రపంచంలోకి వస్తూనే అమ్మమ్మ ఒడిలోకి చేరాడు.

"యువర్ గ్రాండ్ సన్" అంటూ అమెరికన్ నర్స్ పొత్తిళ్ళల్లో పసివాడిని తనకు అందించింది ఆ రోజు!

అప్పటినుండి అన్నీ అమ్మమ్మే భరత్‌కి.

స్నానం చేయించినా, జోల పాడినా, నిద్రపుచ్చినా అన్నీ తనే చూసేది.

వాడీ ప్రపంచంలోకి వస్తూనే తనకీ ప్రపంచమే వాడయ్యాడు.

వాడు నవ్వితే తేనె ధారల వర్షం కురిసినట్లుండేది.

వాడు ఏడ్చినా ఆనంద భైరవి ఆలపించినట్లే విన్పించేది.

"ఉయ్యాల ఫంక్షన్" మాత్రం తను దగ్గరుండి అందర్నీ పిలిచి ఘనంగా జరిపించింది.

"ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు..." అంటూ ఆనాడు కొడుకు మీద ప్రేమ హరివిల్లు విరిసినట్లుగా రాధిక తీయగా పాడిన పాట తన చెవుల్లో ఇంకా విన్పిస్తూనే వుంటుంది.

చూస్తుండగానే తను వెళ్ళిపోయేరోజు రానే వచ్చింది. మనసు గట్టిపరచుకుని వదల్లేక వదిలింది మనుమడిని. మనసు కుదుటపడటానికి మరి ఎన్నినెలలు పట్టాయో!

ఈలోగా రాధిక చెప్పే కబుర్లలో భరత్ ఎదుగుదలను ఊహించుకుంటూ, ఫొటోలు, వీడియోలు చూస్తూ, ఆకాశంలో చందమామను చూసి మురిసిపోయినట్లు సప్తసముద్రాల కవతల తామిద్దరూ మురిసిపోవటం-

"బోర్లాపడ్డాడమ్మా భరత్" అని రాధిక ఫోన్లో చెప్పగానే బొబ్బట్లు చేసి పంచటం-

"పారాడుతున్నాడమ్మా-" అనగానే పరవాణ్ణం కాచుకోవటం.

"అడుగులేస్తున్నాడనగానే-" ఇరుగుపొరుగును పిలిచి అరిసెలు ఇవ్వటం.

మనుమడెక్కడో, మురిపెం మాత్రం మనసునిండా.

మధ్యలో భరత్‌ని ఎత్తుకొని ఇండియా వచ్చింది రాధిక. కూతురు, మనుమడు వస్తున్నారని తెలిసిన దగ్గరనుండి సుమతి పడ్డ ఆరాటం అంతా ఇంతా కాదు. ఇల్లు వాకిళ్ళు శుభ్రం చేయించటం దగ్గరనుంచి కిటికీ కర్టెన్లు ఉతికించి, ఇస్త్రీ చేసే విషయందాకా ఏ విషయంలోను అశ్రద్ధ చూపించలేదు. భరత్ వచ్చే సమయానికి ఇల్లు కడిగిన ముత్యంలా ముస్తాబై స్వాగతం పలికింది.

పట్టుమని పదిరోజులు కూడా అమ్మమ్మని, తాతయ్యను అలరించకుండానే బామ్మగారింటికి వెళ్ళిపోయాడు. ఎవరికైనా మనుమల మీద ఒకేరకమైన ప్రేమలు సాధారణమే కదా! కాదనలేని పరిస్థితుల్లో కన్నీళ్ళతో వీడ్కోలు చెప్పారు అమ్మమ్మ, తాతయ్య.

మళ్ళీ కోలుకోవడానికి కొన్ని నెలలు-

వియోగ-సంయోగాలు అందరికీ మామూలే అయినా తనుమాత్రం ఎందుకింత ఎక్కువగా బాధపడుతోంది?

సుమతికి ఒక్కసారి తన అమ్మమ్మ బామ్మలు గుర్తుకు వచ్చేవారు.

వారంతా ఇంత విచారాన్ని మోసినట్లు గుర్తురాలేదు. ఆఖరికి అమ్మ కూడా. తనకెప్పుడు మనుమల మీద మనసు మళ్ళితే అందిన బస్ ఎక్కో, ట్రైన్ అందుకునో వచ్చేది. నాలుగురోజులుండి ముచ్చట తీర్చుకుని వెళ్ళేది.

కానీ తన పరిస్థితి అలా కాదు.

ఇల్లు వదలటం కాదు. వూరు కదలటం కాదు. దేశమే మారాల్సి వస్తోంది. ప్రయాణంలోని అలసట చాలదన్నట్లు అడుగడుక్కీ సెక్యూరిటీ చెకింగ్స్- బ్రతుకు జీవుడా అనుకుంటూ ఆత్మీయుల్ని చేరటం. ఇప్పుడు కూడా రాధిక పట్టువదలకుండా -

"నువ్వు డాడీ భరత్ పుట్టిన రోజు ఫంక్షన్‌కి తప్పకుండా రావాలి. నువ్వు ఎప్పుడో వాడి డెలివరీకి రావటమే! ఈ మొదటి పుట్టినరోజు డాడీవి, నీవి ఆశీశ్శులు వాడికి కావాలి" అంటూ ఫోన్ చేసి ఊదరపెట్టటంతో భార్యాభర్తలిద్దరూ కలిసి వచ్చారు. 'శెలవల్లేవింక' అంటూ వచ్చిన రెండునెలలకే ఆయన వెళ్ళిపోయినా తాను వుండిపోయింది. మనుమడి మీద మమకారం కూడా కదల్నివ్వలేదు.

సుమతి ఆలోచనలను భగ్నం చేస్తున్నట్లు దూరంగా రాధిక కారు కన్పించింది.

భరత్‌ని పొద్దున తామిద్దరు వెళ్ళి డేకేర్‌లో మొదటి సారిగా వదిలివచ్చారు. తన చేతుల్లోంచి అక్కడవున్న 'నాని' చేతుల్లోకి వెళ్ళటానికి చాలా ఏడ్చాడు. ఈ చిన్న వయసులో అప్పుడే ఇంటికి దూరంగా బయట ప్రపంచంలో బడి కాని బడికి. తలుచుకుంటే సున్నితంగా పిండివేసే బాధ. పాపం అపరిచితుల మధ్య ఎలా గడిపాడో రోజంతా. ఇంట్లో మాత్రం యువరాజులా బొమ్మల రాజ్యాన్ని ఏలేస్తూ తిరిగేవాడు. వాడు లేని ఇల్లు కూడా మౌనంగానే వుంది పొద్దునుంచి.

'ఏం చేస్తాం ఆధునిక యుగంలో అమ్మ ఉద్యోగానికి వెళ్ళాలంటే ఈ పాట్లు తప్పవు' అనుకుంటూ వీధి గుమ్మం తెరిచింది.

అమ్మమ్మను చూస్తూనే దాచుకున్న దుఃఖాన్నంతా కుమ్మరిస్తూ ఏడుస్తూ చేతుల్లోకి దూకాడు భరత్.

"ఏమిటే రాధి వీడికి 'డేకేర్' నచ్చినట్లు లేదు" మను

మదిని బుజ్జగిస్తూనే, కూతుర్నివివరాలు అడిగింది సుమతి.

"వాడికిది మొదటి రోజేగా, క్రమంగా అలవాటు పడతాడులే. నేనింకా ఎన్నాళ్ళు ఇంట్లో కూర్చోను ఉద్యోగం మానేసి. నిన్నెంతకాలం ఇక్కడ వుంచేసు కోను. అక్కడ దాడీ ఒంటరిగా అవస్థపడుతుంటే..వాడే అలవాటుపడాలి. తప్పదు"

ఆ రోజంతా సుమతిని వదల్లేదు, భరత్!

ఆ రాత్రి ఎప్పటిలా భరత్‌ని నిద్రపుచ్చుతూ తనకొచ్చిన జోల పాటలన్ని పాడింది.

"అబ్జావదన ఆటలాడి అలసినావురా..

బొజ్జలో పాలరుగుదాకా నిద్దురపోరా.."

తన గొంతులో మాధుర్యం పలకదు. వయస్సుతో వచ్చిన కంఠంలోని జీర..అయినా ఆర్తిగా వింటాడు భరత్.

ఎప్పటివీ జోల పాటలు.

అమ్మమ్మ తనకు పాడినవి. అమ్మ తన పిల్లలకి పాడినవి. అనుశృతిగా మనసుల్లో నాటుకొని తరతరాల పిల్లల్ని నిద్ర లోకాల్లోకి చేర్చిన పాటలు.

"వింటు వింటు ఎప్పుడు నిద్రపోయాడో" సుమతి గమనించేసరికి గాఢనిద్రలో వున్నాడు భరత్. ఒకచేత్తో తను ఆడుకునే కోతిబొమ్మ, మరొక చేత్తో గట్టిగా పట్టుకున్న బంగారపు గాజులు.

"నిద్రపోయాడా భరత్!" ఎప్పుడు వచ్చిందో రాధిక తల్లి వెనక నిశ్శబ్దంగా నిలబడింది.

సుమతి సమాధానం చెప్పకుండా ఒడిలోని భరత్ వంక చూస్తోంది.

"మళ్ళీ నీ గాజులు తీసుకున్నాడా..ఇవ్వవద్దంటే నువ్వు వినవు. రేపెక్కడైనా పడేస్తే..."

"పోన్లేవే..వాడి కంటేనా..."

"అమ్మా! బంగారపు గాజులమ్మా అవి"

"వీడు నా బంగారమే!" చిన్నగా అంది సుమతి.

"అందుకే అన్నారు. అస్సలుకంటే వడ్డీ ముద్దని.."

మెల్లగా వంగి కొడుకుని తల్లి వడిలోంచి తీసుకుంటూ-

"కాస్సేపు నాదగ్గరే వుండనీ..."

"సూట్‌కేస్‌లవీ సర్దాలా..వీడు నిద్రపోయాకే మనం నిశ్చింతగా ఏ పని చేసినా..కిషోర్ అన్నం తిని వెళ్ళిపడుకున్నాడు. నువ్వు-నేనే భోజనం చేయాలి. లే అమ్మా!" తల్లిది కన్పిస్తున్న బెంగ, రాధికది బయట పడలేని దిగులు.

ఇద్దరూ కలిసి మౌనంగానే భోజనాలు ముగించారు. సూట్‌కేస్‌లు సర్ది అడ్రస్ వ్రాసిన పేపర్స్ అంటించడానికి మరో గంట పట్టింది.

"అమ్మా! అస్సలు విషయం చెప్పటం మరిచిపోయాను. కిషోర్ క్లోజ్‌ఫ్రెండ్ ప్రభాకర్ అని వున్నాడు. అతను వాళ్ళ ఫామిలీతో ఇండియా వెళ్ళిపోతు న్నాడు. నువ్వెళ్ళే ఫ్లైటే. మరేం దిగులుపడకు. నీకు మంచి కంపెనీ వుంటుంది"

రాధిక తీరుబడిగా సూట్‌కేస్‌కి ఆనుకుని కూర్చుంటూ అంది.

"వెళ్ళిపోతున్నారంటే శాశ్వతంగానా" సుమతి అర్థం కానట్లు అడిగింది.

"కాదులే..రెండు మూడు సంవత్సరాలకి. అనుకోకుండా అతనికి ఇండియాలో మంచి ఎస్సైన్‌మెంట్ దొరికింది"


"మీకు కూడా అలాంటిది దొరికితే బాగుండు.." సుమతి అప్రయత్నంగా అంది.

"ప్రభాకర్ చాలా కష్టపడి ప్రయత్నించాడు. కిషోర్‌కి అంత ఓపిక ఎక్కడ? పైగా మేము ఇండియా వస్తే నాకు తగ్గ జాబ్ రాదు. ప్రభాకర్ వాళ్ళు వెళ్ళటానికి కారణం వేరు..పిల్లలిద్దరి గురించి వెళ్తున్నారు"

"అదేమిటే..ఇక్కడ పెరిగిన పిల్లలు అక్కడ అడ్జెస్టవుతారా.."

"మా అందరికీ అదే అనుమానం. కానీ ప్రభాకర్‌కి అతని భార్యకి చాలా పట్టుదలగా వుంది."

"ఏ విషయంలో.." సువతి కుతూహలంగా అడిగింది.



"పెద్దవిషయమేమీ కాదు. ప్రభాకర్‌కి అతని భార్యకి బంధుబలగం బాగా ఎక్కువ. ఇంచుమించు అంతా టౌన్స్‌లో వుండేవాళ్ళే. తెలుగు తప్పించి మరో భాషతో పరిచయం లేదు వాళ్ళకి. ఇక వీళ్ళ పిల్లలకి తెలుగే అర్థం కాదు..."

"మొత్తానికి కమ్యూనికేషన్ గ్యాప్ అన్నమాట" సుమతి మధ్యలో అందుకొని.

“ఔను. కరెక్ట్‌గానే చెప్పావు. వాళ్ళంతా పరాయి వాళ్ళు కాదుగా. అత్తలు, పిన్నిలు, మావయ్యలు, బాబాయిలు. అంతా కావాల్సిన వాళ్ళు. అయినవాళ్ళు. ప్రభాకర్ కుటుంబం అమెరికా నుంచి వస్తోందని తెలిసినప్పటినుండి అందరూ కలుసుకొని ఎలా సందడి చేయాలి అనుకుంటూ ఎదురుచూసేవాళ్ళకు- ఎవరితోను కలవక, ఎంత ఆపేక్షగా దగ్గరకు తీసుకున్నా శత్రువుల్ని చూసినట్లు చూస్తూ, వీళ్ళపిల్లలు చూపించే నిరసనలకు వాళ్ళ వాళ్ళందరికి అసహనం వస్తోందిట.”

“ఏమిటిరా ప్రభాకరం. మా నుంచి దూరంగా వెళ్ళినా శాశ్వితంగా దూరమైపోయారని అనుకోలేదు ఏనాడు. ఇప్పుడు నీ పిల్లలు మన కుటుంబాల్లో కలవలేకపోతున్నారు. పలకరిస్తేనే అర్ధంగాక ఏడుస్తున్నారు. ఏం చేయాలిరా..” అంటూ తల్లి, తండ్రి బాధపడటంతో ప్రభాకర్ ఈ నిర్ణయం తీసుకున్నాడు.

“నిజమే. మంచి నిర్ణయమే తీసుకున్నాడు. కానీ శోచనీయమైన విషయం ఏమిటంటే! తెలుగుభాషకు తెలుగుదేశంలోనే ఆదరణ లేకుండా పోయింది. ఇప్పుడక్కడా ఎవరూ తమ పిల్లలకు తెలుగు నేర్పాలని కాని నేర్చుకోవాలని గాని అనుకోవటం లేదు. చదువుల్లో మార్పు, కాలంలో మార్పు. ఆలోచనల్లో మార్పు. మొత్తానికి తెలుగుభాషలోని మాధుర్యం ఇప్పుడెవరికి అఖ్ఖర్లేదు. ”

“అదంతా వదిలెయ్యి. రేపు నీ కొడుకు నన్ను 'గ్రాండ్ మా' అంటాడో, 'అమ్మమ్మ' అంటూ అక్కున చేరుతాడో చూడాలి...”

“నువ్వు భయపడకు... కిషోర్, నేను వాడిని తెలుగుదనం తేలిసేలాగానే పెంచుతాం. ఇక్కడ కూడా చాలామంది మన సంస్కృతిని మరిచిపోవటం లేదు. వాళ్ళ పిల్లలకు ఎన్నో విద్యలు నేర్పిస్తున్నారు” రాధిక హామీ ఇస్తున్నట్లు అంది.

“మంచిదే... మీ నాన్న మాత్రం తన మనవడికి చందమామ కథల నుండి, భారతం వరకు వివరించి చెప్పాలని వువ్విళ్ళూరుతున్నారు. సుమతి శతకం నుండి, శ్రీనాధుని సీస పద్యాల దాకా వల్లె వేయించాలనుకుంటున్నారు.”

“ఔనమ్మా. దాడీకి చాలా ఓపికే. మా గురించి ఎంత తాపత్రయపడేవారో మర్చిపోగలనా...నా కొడుక్కి మొదటి గురువు డాడీయే” రాధిక తండ్రిని తలుచుకుంటూ ఆనందంగా అంది.

★ ★ ★

ఎయిర్ పోర్ట్‌లో ప్రభాకర్ కుటుంబాన్ని పరిచయం చేశాడు కిషోర్! వాళ్ళగురించి రాధిక అంతకుముందే చెప్పటంతో సుమతికి కొత్తవాళ్ళలా అన్పించలేదు. బాగా పరిచయం వున్నట్లు మాట కలిపింది.

అంతలోనే , ప్రభాకర్ త్వరగా వెళితే 'సెక్యూరిటీ చెకింగ్' దగ్గర 'క్యూ' అంతగా వుండదు అంటూ తొందరచేసాడు.

అప్పటివరకు అమ్మమ్మ చంకలో హాయిగా నవ్వుకుంటున్న భరత్ ఒక్కసారి తల్లి ఎత్తుకునేసరికి అర్ధంగానట్లు అమ్మమ్మ వంక చూసాడు.

మనుమడి కళ్ళల్లోకి చూసే ధైర్యంలేనట్లు సుమతి వాడి బుగ్గల్ని మెల్లగా ముద్దాడి-

“వస్తానే రాధీ..” అంటూ భారమైన మనసుతో బరువుగా వున్న కార్ట్‌ని త్రోసుకుంటూ ముందుకు వెళ్ళింది సుమతి.


అమ్మమ్మ అంత హఠాత్తుగా తనని వదిలి దూరంగా వెళ్ళిపోవటం అర్ధంకాని భరత్ ఏడుపు మొదలుపెట్టాడు.

అప్పటికే సుమతి ఆ ఏడుపు విన్పించనంత దూరం వెళ్ళిపోయింది.

★ ★ ★

ప్రభాకర్ కుటుంబం వుండటంతో ప్రయాణంలో విసుగు తెలియలేదు సుమతికి.

మనసులో మనుమడి దిగులు మరుగున పడెయ్యటానికి అన్యమనస్కంగా ఏదో మాట్లాడుతున్న సుమతి ధ్యాస అంతా భరత్ మీదే వుంది. మాటల మధ్యలో అప్రయత్నంగా చేతుల వంక చూసుకుంది. ఒక్క నిముషం కంగారుపడ్డా మరో నిముషంలో జరిగింది ఊహించు కోగలిగింది.



“ఏమిటి ఆంటీ...” ప్రభాకర్ భార్య, సమతి దేనికో వెతుక్కోవటం చూసి అడిగింది.

“అబ్బే! ఏం లేదు. నాదొక బంగారపు గాజు మిస్ అయింది. బహుశా అది భరత్ ఆడుతూ ఎక్కడో పడేసి వుంటాడు” అంది తేలిగ్గా సుమతి.

“మాకు పనివాళ్ళు వుండరుగా..ఎక్కడికి పోదు. రాధిక చూస్తే దాస్తుంది లేండి” ధైర్యం చెప్పింది ఆమె.

★ ★ ★

ఆ రాత్రి నిద్రపోతున్న భరత్‌కి దుప్పటి కప్పటానికి వచ్చింది రాధిక. రోజులా కాకుండా వాడంతట వాడే నిద్రపోవటం చూసి మనసు ఎందుకో చివుక్కుమంది. దుప్పటి కప్పుతూ పరీక్షగా చూసింది. ఒక చేత్తో తల్లి బంగారపుగాజు గట్టిగా పట్టుకుని నిద్రపోతున్నాడు.

రాధిక చిన్నగా నవ్వుకుంది. “అమ్మమ్మని తన దగ్గరే బంధించుకున్నంత దృఢంగా పట్టుకున్నాడు గాజుని. ఆ గాజుని చూస్తూ 'అమ్మ మనస్సు, ఆవిడ ఆశీస్సులు భరత్ చుట్టూనే వున్నాయి' అనుకుంది రాధిక తృప్తిగా.

○

## పాపం మీరా!

**అందాల తార మీరాజాస్మిన్ పేరుకు తగ్గట్టే మల్లెపువ్వులాగే ఉంటుంది. ఆమె నటించిన భద్ర, యువ, గుడుంబా శంకర్, పందెంకోడి లాంటి పలుచిత్రాలు మీరాకి ఓ స్టార్ ఇమేజ్‌ని తీసుకొచ్చాయి. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నటిస్తూనే తన మాతృభాష మీద ఉన్న మమకారంతో మలయాళంలో ప్రయత్నాలు చేస్తూనే ఉంది. కానీ విచిత్రం, అక్కడ మాత్రం ఆమెకి అవకాశాలు కరవయ్యాయి. రచ్చ గెలిచినా ఇంట గెలవలేకపోవడం అంటే ఇదే!**